
# బుడ్డి బుడ్డడు కత

ఒక వూరలట ఒక మొగడూ పెళ్ళాలున్నారట. పాపం బీదోలట! ఆడికి ఎన్నాలనుంచో బూరులు తినాలని వున్నాదట. బూరులు తినాలని వుంతే- 'ఓలే... బుడ్డి బుడ్డీ... నాకు సేనారోజుల్నుంచి బూరులు తినాలని వున్నాదే.. ఎక్కడికి మన మెల్తాము? మనకి ఎవలూ లేరు. ఎక్కడకెళ్తె ఎవులు వండి ఏస్తారంటే ఎవులూలేరు... ఎలగే..'అన్నాడట మొగుడు.


పెళ్ళమన్నాదట. 'నీకేటి పిచ్చిరా బుడ్డా... ఎవులు పెడతారు... మనకి గెంజే కడుపార తాగడానికి లేదు... మనము బూరులు వండుకోగలమా సెప్పిమీ' అన్నాదట.

'మరి ఎలగే?' అనుకున్నారట.

'అయితే... ఒక పని సేతుము. నీను కఱ్రలు తెస్తాను. అడివికెళ్ళి. ఆమోపుడు కఱ్రలూ అమ్ముదుము. మరి మనము బియ్యము గఱ్రకొనుకోవద్దు. ఎంతొస్తే అంత... ఎన్ని బూరులయితే అన్ని బూరులు వండుకోని



తినేతుమే అన్నాడట.
'సరేని లేరా... నీనూ కూలికెల్తాను. ఎంతొస్తే అంత. అదీ ఇదీ కలిపి వండుకుందుము' అన్నాదట.
అలగిద్దరూ అనుకున్నారట.
అదేమో కూలికెలిపోయింది.
ఈడేమో కఱ్ఱలకని అడివికెలిపోనాడు. మాంచి అడివిలో కెళ్ళాడట. ఎక్కడా ఎండు కఱ్ఱలు లేవట. పచ్చివేనట. ఎండుకఱ్ఱలకోసం ఎటుక్కోని ఎళ్ళినాడట. ఒక దగ్గిరెక్కడో పులపచ్చిగ వుంటే కొడతన్నాడట.
ఇంతలోన-
పులి వచ్చీసింది!
ఎలాగ?
బాంఱ్ఱ బాంఱ్ఱమనుకోని!
డాక్ డాక్ మనుకోని!!
అనికట ఆ పులికట గొప్ప ఆకలేస్తందట!
తినేస్తానని మీదపడబోతే-
'నాకు తినకు నాకు తినకూ- మీ మీవేళ బూరె లొండుతాము. నీకు బూరెలిస్తాను. బూరలెల గుంటాయి తెలుసునా? నువ్వెప్పుడయినా తినున్నావా?' అంటే-
'నీనెప్పుడు తినలేదురా' అన్నాదట పులి.
'అవున్రా.. నీ పేరేట్రా?' అని కూడా అడిగిందట.




'నా పేరు బుడ్డడు'
'... అయితే సరేరా బుడ్డా... నీనూ సెక్కలు లాగుతాను..' అనీసి.. పెద్దేసి మానులు పొరల్లాగ సెక్కలు ఇడుస్తాయి కదా.. ఆటికి పట్టి పీకేసిందట పులి. లాగీసిందట. సెక్క సెక్కలు సెక్క సెక్కలు. పెద్దమోపు సేసిందట.

'...అయితే నువ్వు నాకు ఇస్తావని నమ్మక మేట్రా బుడ్డా?' అని పులంటే-
'నమ్మకముండాల. మనిషి మీద మనిషికి నమ్మకం లేకపోయినా ఫరవాలేదు గాని మనిషి మీద పులికి నమ్మక ముండాల' అన్నాడట. అనీసి 'మా ఇల్లు ఈ వూరు సివర్న. పొద్దోగట్ల ఏ ఇంట్లయితే ఎక్కువ పొగ వస్తాదో- వూరి సివర్న.. ఆ ఇంటికి నువ్వు ఎలిపోరా! ఎలిపొస్తే నువ్వు బూరులు తిందువుగాని... నీకు వుస్తాను' అన్నాడట.
' ఓర్నాయినో.. నీను వూర్లోకొస్తే.. నాకెవలు వుస్తారు? కొట్టేస్తారు.. బుడ్డా నాకెలగయినా బూరెలు తెచ్చి ఇచ్చిరా' అన్నాదట పులి. 'ఓరె... నాకు గొప్ప ఆకలేస్తంది. నీమాట మీద నమ్మకముంది గాని లేపోతే తినీనా?!' అన్నాదట. 'అంత ఆకలేస్తంది' అన్నాదట.
'... లేదు... లేదు... బూరిలు తింటే నువ్వు వదలవు.. అంతబాగుంటాయి. నాకెన్నాలబట్టో కోరిక వుండిపోయిందీ. ఆ బూరిలు నీను తీనీసిన తరవాతయినా నాకు తినీతువుగాని గానీ.. నాకిప్పుడు తినకే' అన్నాడట.
'సర్లే... పోనెళ్ళు.. ఎలగుంటే అలగే వున్నాది... 'అనీసి తప్పకుండ మాటతప్పకుమీ' అన్నాదట పులి.
తప్పనన్నాడు బుడ్డడు. 'నీను రానుగానీ... మా ఇంటికిరా... మా ఇంటికొస్తే ఇన్నన్ని కాదు... కావలసినన్ని తినొచ్చును. మా ఇంటికిరా తప్పకుండ ఇస్తాను' అన్నాడట.
అయితే - మాటంటే మాటే- మాటంటే మాటే- అనుకున్నారట.
అయితే పొగొచ్చిందే మీ ఇల్లుగదా?!' పులి!
'గుప్పున పొగస్తాది... అదే మా ఇల్లు' బుడ్డడు!
సెక్కలు మోపుతోటి తెచ్చినాడట వూర్లోకి. అమ్మతోటికి ఏటీ రాలేదు. వచ్చినదనితోటి నూనేటివస్తాది? పప్పేటి వస్తాది? పిండేటి వస్తాది? బెల్లమేటొస్తాది? ఏం సేతును? ఎలగ? నీనేటి తింతాను? నాపెళ్ళానికేటి ఎడతాను? ఇంక పులికేటి ఎడతాను?'
అని బాగా ఆలోసించి సెరువుకెళ్ళాడట!
సెరువులున్న నీలళ్ళా తాగేనాడట!? తాగేసి ముక్కుల ములంకాయ ఎట్టేడట! సెవిటిల సెవ్వాకెట్టాడట! నోటిల గడ్డిబిండ ఎట్టేడట! వచ్చినాడట కోవిటోడి కడకి.
'నాకు అడ్డడు మినప్పప్పు ఇయ్యి. ఒక వీసెడు బెల్లమియ్యి. ఒక నాలుగు తవ్వల

నూనియ్యి...' అని అన్నాడట బుడ్డడు.
'ఓరేట్రో... ఈ పొద్దు బుడ్డడికి మంచి టెంపరయుంది...' అని కోవిటోడు అన్నాడట.
'టెంపరీ లేదు. గింపరీ లేదు.. నాకు ఇస్తావా? ఇవ్వవా?' అన్నాడట.
'నీకేటి సూసి ఇవ్వాల్రా? ముందలపైసాలు తేరా?' అన్నాడీ కోవిటోడు.
'నాదగ్గిర లవిన్నిలేవు. ఈ పైసలేవున్నాయి..'బుడ్డడు.
'ఇవేనా?' కోవిటోడు.
'ఇవి'మోపిడు'పైసలు' అన్నాడట బుడ్డడు.
'మోపిడు'సెప్పినావుగాని... యాబలం బెల్లవేఁ రాదు'అన్నాడు కోవిటోడు.
'అయితే మరి నాకివ్వవా?'
'ఇవ్వను...'
బుడ్డడు ఏటి సేసినాడూ? ముక్కుల ములక్కాయ తీసేనాడు. సెవిటాల సెవ్వాకు తిసేనాడు. నోటిల గడ్డిబింద తీసేనాడు. తీసేత్తోటికి నీలూ నీలు! నీలయితే వుంతాయా? కొట్టులోని సావానంతా తడిసిపోతంది. సావానంతా తడిసిపోతోటికి?-
'ఓరే బుడ్డానీకు దండవెడతామురో.. ఓరి.. పీర్సుకోరా పీర్సుకోరా.. నీకు యాబలమూ పదలమూ కాదు ఎన్ని మణుగులు ఏటేటి కావాలో ఇస్తాన్రా.. పప్పిస్తాను.. పిండిస్తాను. నూనిస్తాను.. బెల్లమిస్తాను... సమస్తమిస్తాను' అన్నాడట.
అని కోవిటోడు బతిమలాడుకున్నాడట.
సరేననీసుకోని మళ్ళ ఆ నీలన్నీ పీల్సుకోని-మళ్ళ ముక్కుల ములంకాయ... సెవిటల సెవ్వాకు.. నోటిల గడ్డిబింద.. పెట్టుకోని- ఇచ్చినవి అన్నీ పట్టుకోని ఇంటికి వచ్చీసినాడట! వచ్చీముందర ములక్కాయ, సెవ్వాకు, గడ్డిబింద తీసీసరికి నీళన్నీ సెర్ల బడిపోనాయి. సెరువు నిండిపోయింది!? ఈడు ఇంటికొచ్చినాడు గదా?
'ఓలె.. బుడ్డీ బుడ్డీ.. ఇగోయే పప్పుతెచ్చినాను.. ఇగోయే బెల్లం తెచ్చినాను. ఇగోయే నూన తెచ్చినాను... ఇగోయే పిండి తెచ్చినాను.. సూత్తావేటి? సెయ్యే బూర్లు' అన్నాడట.
'అవున్రా బుడ్డా ఇన్నే..? ఎవులు సేస్తార్రా?' అంతే-
'...లేదు సేసియ్యే అవస్తదీర తిందుము. పులికూడా బూరిలు తిండికి వస్తాది. ఇవ్వకపోతే మనల్ని

తినేస్తాది. ఇస్తానని ఒప్పుకున్నాను. సెయ్యే'
అన్నాడట మళ్ళీ బుడ్డడు.
సరేననీసి ఈ బుడ్డి పప్పదీ నానేసీసిందట.
పెనమేసి నూనేసి కమ్మగ బూరులు
సేసిందట. ఆఖరికి రొండుపుంజాల బూర్లుకి
మద్దిన కొబ్బరికోరు అడెట్టీసినట్టు రాళ్ళు
అడెట్టీసి-నాలుగు మంచి బూరులు
నాలుగు రాలుబూరులు
సేసీసినారట. సేసీసి-
ఒకింత ఆనప
తుంబున్నాదట.
ఆనపకాయకి
గుజురుతీసీసి-
సితారకెడతారూ అలాటిది
ఆనపతుంబ.
ఆనపకాయకి పీకతీసీసి
'బుడ్డి బుడ్డి మన
మిందల దాగుండి
పోదాము. ఏటి?
మనముగాని
కనబడ్డామో పులి మనల్ని తినెస్తాది. ఏటి?!'
అనీసంతే-
'మరెలగరా బుడ్డా?' అన్నా- ఎన్నన్నా-
నోరుపట్టలేక ఈ బూరిలల్లా, కడుపునిండా
తినేనారట! తినీసి దొలిసీసి వుంచినారు గదా



ఆనప తుంబల దిగిపోయి మళ్ళ మూతెట్టీసి
నారట. దిగేముందు పొయ్యినిండ
టంపెట్టేనారట!
పొద్దుబోయిందిగదా... ఆపులి వూరి సిగురున
కూకోయుందట కాసుకోని...
ఎప్పుడు పొగొస్తే... ఎప్పుడుకి ఎల్తానా?' అనీసి.
బూరులు తింతానని నాలిక సప్పరిస్తన్నాది.
ఈలు ఎట్టిన టంపుకి
పొగవస్తన్నాది. పులి
సూసింది. ఆ సీకటిల
తెల్లటి పొగ వస్తన్న
ఇంటికి
వచ్చీసినాది. వచ్చీసరికి
దోరం మీద వరసాగ
బూరులు. ఒకమంచి
బూరి- ఒక
రాయిబూరి... ఒక
మంచిబూరి ఒకరాయి
బూరి ఇలాగ
వరుసగున్నాయి.
పేరిసీసున్నాయి.
పులి వచ్చింది. ఈ ఘుమ ఘుమ వాసనకి
తేగుడు కార్చుకోని బూరి అందుకు తిన్నాది.
అది మొదాట మంచి బూరి తిన్నాది.'మా బుడ్డ
డు మంచోడు' అన్నాదట. మళ్ళ రాయిబూరి

తిన్నాదట. 'అన్న...కక్క' అన్నాదట.
ఇలాగ తింతదట. తింతుండి రాయిలు
పళ్ళకిందపడి పళ్ళువూడిపోయినా,
అయినా తినడం మానకండా తింతందట.
రాలు వాలుసుకోని.
మంచిగ బూరిలు గట్రా బాగా తిని ఆనప
తుంబలో దూరిపోయి కూకోయున్నారు కదా
బుడ్డిబుడ్డడు-
గట్టిగ తినేడం కడుపు పొంగున్నాది. అప్పుడు
బుడ్డడు అన్నాడట.
'ఒలె బుడ్డీ బుడ్డీ మరి నాకు
వుచ్చ వస్తందెలగె?'
'ఒరె బుడ్డా.. అదిగోదా పులి అక్కడేవున్నాది..
మెల్లిక పొయ్యారా' అని బుడ్డీ అంతోటికి ఆడు
'సుఁయ్ఁ...'ని పోసాడట!
ఓర్నాయిన ఏటి శబ్దమని పులి జడిసి
పోయిందట!? జడిసిపోయి సుట్టూ సూస్తం
దట. సూసి.. ఆగి.. మళ్ళీ తింతందట.
'ఓలే బుడ్డీ బుడ్డీ నాకు పిత్తొస్తంది ఎలగే?!
అంతే- 'ఓరె బుడ్డా మెల్లిక పిత్తురా' అంతే-
ఆడు 'బడ బడ భడ భడ భఢాల్ 'మని
పిత్తినాడట!
'నాయినో ఎవలో బాంబులేసేనారు...'
అనుకోని ఆ బూరిలు వదిలేసి పులి మళ్ళీ
అడివికి పారిపోయిందట!

అప్పుడికే ఇచ్చిపోయిన అనపతుంబలోనుండి
తెగిసినారు. తెగిసి "పీడవొదిలిపోయింది
దేవుడా' అనుకోని - ఆయిగ వున్నారు! బుడ్డీ
బుడ్డడు! ఆడి కోరికతీరిపోయింది కదా
ఆయిగ బతుకుతన్నారికన. కూలిసేసుకోని-
బుక్కడో సక్కడో కూలి తెచ్చుకోని-గెంజో
గడుగో తాక్కోని వున్నారు.
ఆల కష్టం ఆలకి దక్కింది... అంతే సేన!

